# ఆకర్ష

ఆ కాలేజీలోకల్లా రేణుకది గొప్ప అందం. ఆమెను చూడని కళ్లు కళ్ళు కావనీ, ఆమె నడచిన త్రోవలో నడవని కాళ్ళు కాళ్లు కావనీ, ఆమె పీల్చి వదలిన గాలివల్లనే ఇన్ని పరిమళాలు గాలికి ఉండటం సంభవించిందనీ, మిగతా విద్యార్థులు మనఃపూర్వకంగా నమ్మారు. ఇంతేకాదు. సృష్టిలో అందవికారులుండటానికి కారణ మేమిటోనని బుర్ర బ్రద్దలు కొట్టుకునేవాళ్లకు, ఆమెను చూడంగానే సమస్య ఇట్టే తేలిపోయింది. భగవంతుడు తన సౌందర్య తృష్ణనంతా ఆమెలో నిక్షిప్తీకరించటంవల్ల మిగతావారిని, అందంగా చేదామన్నా వీలులేకుండాపోయిందట. ఈ సంవత్సరం ఆంధ్ర దేశంలోకల్లా తక్కువమంది విద్యార్థులు పాసయింది ఈకాలేజీయే కావటానికి కారణం, రేణుకను చూస్తూ, విద్యార్థులు పాఠములు వినకపోవటమేనని తేలింది. మానవజన్మ ఎత్తటం నిరర్థకమని విలపించే యువకులు కొంతమంది, ఆమెనుచూడగానే, దృక్పథం మార్చుకున్నారు. తమ కళ్ళు, ఈనాడు ఈమెను చూడటంవల్ల సార్థకమయినాయిగాని, లేకపోతే అవి వొట్టి గాజు కుప్పెలేననికూడా కొందరు నమ్మారు.

అయితే ఒక్క కళ్ళు మాత్రమే సార్థకం కావటం వాళ్ళకు అసలు తృప్తిగావుంది. చూడటంవల్ల కళ్ళు, ఆమె గదిలోకి నడవటంవల్ల కాళ్ళు, ఆమెను తాకుటవల్ల వ్రేళ్లు, మానవజన్మ—అందులో పురుషజన్మ ఎత్తినందుకు కృతార్థత పొందాలని చాలామంది అనుకున్నారు, అనుకొంటు

న్నారు. ఆమె అందం పెట్టే కలవరంవల్ల విద్యార్థులు చెడి పోతున్నారని తెలిసికూడా లెక్చరర్లు ఆమెను "ఒద్దు" అన లేకపోవటానికి కారణం, ఆమెవల్ల తమరక్తంకూడా కల వరపడి, ఇంటిదగ్గర ముందుగదుల్లో అణగారిన భార్యలు, ఏనాడు అట్లాంటికలవరం, తమలో కలిగించరు గనక అటు వంటి "పాపపు కలవరం" ఎంతో హాయిని, ఔన్నత్యాన్ని జన్మకు కలిగించి, ఏనాడూ ఇటువంటి మధుర వేదనను ఎర గకపోవటంవల్లనేనని తేలిపోయింది.

ఒకనాడు తెలుగు లెక్చరరుగారు ఏదో ప్రబంధాన్ని గురించి చెబుతూ మధ్యలో "రాధికా సాంత్వనం" లంకించు కుని "ఎటు తాళనున్నవో ఈ తన్వి లేదొడల్ చాఃఖూరహారు మారుసాధనలకు?" అనే పద్యం ఆమెవేపుచూస్తూ, తనే కృష్ణుడైనట్టు భావించుకుని పీరియడ్ మొత్తం గడిపేశాడు.

రేణుక ఆ కాలేజీకి గొప్ప వరమయింది. ఆమె రాని రోజు ఆ కాలేజీ అందమే ఉండదు. విద్యార్థులకు ఏమీ తోచదు. లెక్చరర్లు పాఠాలు చెప్పటం ఏదో కలవరింతగా ఉంటుంది. పురుషలోకం ఈవిధంగా ఆమెకు దాసోహం కాగా, మిగతా స్త్రీ విద్యార్థినులు ఆమెకు శత్రువులయి నారు. ఆమె ముందు తమను గుర్తించేవాళ్లే లేక, వాళ్లు మానసికంగా, దైహికంగా చాలా బాధలు పడుతున్నారు. ఏ పురుష విద్యార్థీ తమవేపు చూడడు,పలకరించడు, నవ్వడు తాము కావాలని. ఎంత రాచుకుపోయినా వాళ్లు తొలగి పోతున్నారు. ఒకనాడు, అందరిదృష్టి తమవైపు తిప్పుకోవా లని తతిమ్మా విద్యార్థినులందరూ, చాలా నాజూకుగా

తయారై వచ్చారు. బజారు మనుషులు వాళ్ల అందం చూడటంతప్ప, కాలేజీకి సంబంధించినవాళ్లెవరూ వీళ్ల వేపు, ముఖమైనా తిప్పలేదు. ఆ అవమానం భరించటం ఎంతో దుర్భరంగా ఉంది వాళ్లకు.

రేణుకకు యీ సంగతి తెలుసు. తన అందానికి ఎంతో గర్వపడేది. అంతా తన వేపు చూస్తున్నప్పటికీ తను ఎవరి వేపూ చూడదు. ఒక్కరోజున కూడా ఆమె టాయిలెట్ కాకుండా స్కూలుకు రాదు. ఆమెకు డబ్బుకూడా ఉంది. అట్లాగని ఏ కారుమీదనో, జట్కామీదనో రాదు. ఆ విధంగా వచ్చినందువల్ల తనను చూడటం అందరికీ సాధ్యం కాదు. తన ఆరాధకుల సంఖ్య తరగకపోవచ్చుగానీ, పెరగదు. ఇది ఏమాత్రం రేణుకకు ఇష్టంలేదు. తనను చూచి వెర్రులెత్తే జనం, రోజు రోజుకూ ఆమెకు పెరగాలి.

ఇదివరకు ఎక్కడో గదిలో ఉండేది. హోటల్ నుంచి క్యారియర్ భోజనం. ఆ వీధికి విద్యార్థుల రాకపోకలు ఎక్కువయినందువల్ల, వాళ్ల ఈలలు, కేకలు భరించలేక హాస్టలులోకి బస మార్చుకుంది. ఆ హాస్టలు కేవలం ఆడపిల్లలకు ప్రత్యేకం. ఆమె అసలు ఎవ్వరివేపూ చూడదు. ఒకవేళ చూసిందో, వాడు ఆ రోజున మిగతా స్నేహితుల ఖర్చులన్నీ భరించాలని, వాళ్లలో వాళ్లే నియమం ఏర్పరుచుకున్నారు—అంత అదృష్టం పట్టినందుకు వాడికి. ఆమె రోజు రోజూ కొత్తకొత్తవిధంగా అలంకరించుకుని వస్తుంది. ఆమె అలంకారం చూస్తే కేవలం యువకుల్ని ఈవిధంగా పురికొల్పి బాధించటమే ఆమె కానందమేమో ననిపిస్తుంది.

ఆమెకు తెలుసు, తనను గురించి ఎవరెవరు ఎటువంటి పాట్లు పడేదీను. ఆమెకు కూడా వాళ్ళ ఉత్సాహాన్ని బొత్తిగా పాడుచెయ్య బుద్ధిగాక అప్పుడప్పుడు నవ్వుతుంది. దాచుకుంటూ పోతుంది. ఎవర్నో ఏదో కావాలన్నట్లు కాసేపు అపేక్షగా చూసి, చప్పున తలవంచుకుని చకచకా నడుస్తుంది. కొంతదూరంపోయి, మళ్లా వెనక్కి చూసి ఆగి, తిరిగి వెడుతుంది. ఇక వారంరోజులవరకూ ఆ దౌర్భాగ్యుని పాట్లు వర్ణనాతీతం. చీకట్లో వానలో, మంచులో సిగరెట్లుకాలుస్తూ ప్రతి చిన్న చప్పుడుకూ, ఆమేమోనని ఉలిక్కిపడుతూ హాస్టలు చుట్టూ పడిగాపులుకాయటం తప్పదు.

ఈవిధంగా రేణుక ఆ కాలేజీ సామ్రాజ్యాన్ని సౌందర్యపరంగా ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలిస్తున్నది. అయితే ఆమె పాలనలోకి రానివాడు, ఆమె వేపే చూడనివాడు, ఆమెనుగురించి ఏ క్షణమూ తలవనివాడు, కనీసం తలచనట్లు కనిపించేవాడు. ఒకడున్నాడని రేణుక కొంత కాలానికిగాని కనిపెట్టలేకపోయింది. అది తెలుసుకున్ననాడు, ఆమె పొందినబాధ చెప్పటానికి వీలుపడనిది. ఇంతకాలమూ, తను ఏ అడ్డమూ లేకుండా, మొత్తం కాలేజీని తనవెంట, పాదచిహ్నాలవెంట, చూపులవెంట, నల్లజుట్టు నొక్కులవెంట తిప్పుకోగలిగింది. కాని, ఓడిపోయింది. పురుష లోకమంతా తన నవ్వుకోసం కంటి చివరచూపు కోసం, చిన్ని పెదిమల కదలిక కోసం కలలుగని, తపస్సులు చేస్తుంటే, వీడు—ఈ గోపాలం, తనంటే లక్ష్యమే లేనట్టు,

ఏదో మామూలు వస్తువయినట్టు భావించటం ఎంత అవమానం!

తెల్లవారి చూసింది అతన్ని—తన సౌందర్య విముఖుణ్ణి. తన క్లాసే! మనిషి మంచివాడే. బీదతనంగా ఉంటాడు. పుస్తకం చాటు చేసుకుని చాలాసేపు అతన్ని చూసింది. గోపాలం కూడా ఒకటి రెండుసార్లు ఆమె వేపు చూసి, ముఖం తప్పించాడు. ఆమె అటు వేపు చూస్తున్నప్పుడు, ఆ చూపులు గోపాలానివని ఎవ్వరూ అనుకోలేదు. గోపాలం ప్రక్కనే ఉన్న యింకో ఎర్ర, బొద్దు, సిల్కుగుడ్డల యువకుణ్ణనుకున్నారు. ఆరోజు ఆ క్లాసు మొత్తం సాదరుఖర్చు ఆ దౌర్భాగ్యుడు భరించుకోవలసివచ్చింది.

ఆరోజు మొదలు ఆమె, వీలయిన ప్రతిసారీ, గోపాలాన్ని చూడసాగింది. కాని అతను చూడడు. పోనీ భయంవల్లనేమోనని సరిపెట్టుకోవాలనుకుందిగాని, అతనికంటె అధమాధములు కూడా ఆమెపట్ల అమితధైర్యాన్ని ప్రదర్శిస్తున్నప్పుడు, కేవలం అతనొక్కడే భయపడటం దేనికి? పోనీ అంత తెగింపుగా తనవేపు చూడకపోతే మానె, కనీసం తను చూచినందుకు ఏదో విధంగా కృతజ్ఞత చూపవచ్చు గదా. అది కూడా గోపాలం చెయ్యడేం? అతని నుండి ఏ విధమయిన రెస్పాన్సు రాకపోవటం ఆమెకు అవమానంగా ఉంది. ఇంత మందిని తన వెంట తిప్పనేర్చిన ఆమెకు, తనో గొప్ప ప్రాబ్లం అయ్యాడు.

ఇంకోసారి రేణుక అతన్ని రాచుకుని పోయింది. కొంతదూరం వెళ్ళి, ఫలితం కోసం వెనక్కు తిరిగి చూసింది.

గోపాలం మామూలుగా తలొంచుకుని వస్తున్నాడు. చివరికి తలెత్తి ఆమెను చూడనయినా లేదు. వెనుక విద్యార్థులు మాత్రం గుస గుసలుపడి, అతన్ని చుట్టుముట్టి అభినందించటం చూసి, ఆమె కోపంగా, చరచరా హోష్టలుకేసి నడవసాగింది.

ఆ వేళ ఆమె మనస్సు చికాకుగా వుంది. ఏ మాత్రమూ చెలింపక, కొండశిఖరంవలె, గంభీరంగా చరించే అతని ప్రవర్తన, ఆమెలో ద్వేషాన్ని రగుల్కొల్పుతోంది. ఒకవేళ అతను జడుడేమో? సౌందర్యాంధుడేమో? అందాన్ని అనుభవంలోకి తీసుకోగల సౌకుమార్యతను అతను కోల్పోయాడేమో! రేణుకకు నవ్వొచ్చింది. ఇదే నిజమయితే యింతకంటే పరిహాసాస్పదమయిన విషయం ఏముంది వేరే? అటువంటి శిలకోసమా తను ఆందోళనపడటం? ప్రాణి ఏ సెన్సుకయినా రెస్పాన్సు యివ్వగలుగుతుంది. నిర్జీవాలు ఏమిస్తాయి? ఆమెదృష్టిలో గోపాలం నిర్జీవి. పాషాణం. జడుడు. సౌందర్యాంధుడు. ఇంక ఆమె అతన్ని తన గిరిలోకి తీసుకునే ప్రయత్నం విరమించింది, అతన్ని స్త్రీ సౌందర్య విముఖుణ్నిగా తలచి.

కానీ కాదు. ఆమె తప్పుగా ఊహించింది. ఇంకోనాడు ఆమె ఏవో గుస గుసలకు అటు చూడవలసివచ్చింది. గోపాలం ఆ సన్నపిల్లతో, నవ్వుతూ మెల్లగా మాట్లాడుతున్నాడు. తనవేపు అతను, అంత సంతోషమయిన ముఖంతోనూ తిరగాలని, ఆమె చిన్న దగ్గు దగ్గింది. కావాలని పుస్తకాలు, పెద్ద చప్పుడుతో క్రిందకు మార్చింది. అతను

ఒక క్షణం ఇటు తిరిగి, ముఖం చిట్లించి, చప్పున నవ్వుతూ, మళ్ళీ సరోజిని వేపు మళ్ళాడు. అప్పటి కింకా లెక్చరర్ క్లాసుకు రాలేదు. ఆమెకు నడివీధిలో గుడ్డలు లేకుండా నిలబెట్టినట్లయింది. పాఠాలు ఏమి జరిగినయ్యో ఆమెకు తెలీదు. అవసరం కూడా లేదేమో! అతను యింత...చూడక—ఆ సరోజిని వేపు చూడటం...ఇదే మరొకరయితే, తన దయాలేశంకోసం ప్రాకులాడేవాడయితే, ఆమెకు ఏ బాధా ఉండకపోను. ఎదుటి పిల్లతో, పరిచయానికి ప్రయత్నిస్తున్నది. గొప్ప అందమయిన తనను తిరస్కరించిన, శత్రువు-తనకంటే ఎందులోనూ, అధికంగాని సరోజినితో.

క్లాసు అయిపోయింది. విద్యార్థులంతా బైట ఆమె రాకకోసం ఎదురు చూస్తున్నారు. కొంతసేపటికిగానీ, ఆమెకు కాలేజీ వదిలిన జ్ఞాపకం తట్టలేదు. పుస్తకాలు తీసుకుని, చకచకా క్రిందికి వచ్చింది. కొంతమంది గేటుదగ్గిర ఎదురు చూస్తున్నారు ఆమెకోసం. ఆమెకళ్ళు ఆ గుంపులో ఎవరినో వెదుకుతున్నయ్. అట్లా రేణుక అందరి ముఖాల్లోకీ చూస్తుంటే, గొప్ప సంతోషం వేసింది అందరకూ. ఈ రోజు ఎవడు అదృష్టవంతుడో? ఎవణ్ణి పలకరిస్తుందో? ఆమె ఎవ్వరినీ పిలవలేదు. ఒక్కసారి ఆమె ముఖం, ఎరుపు చిగురించింది. అంత దూరంలో, ఈ గొడవేమీ తెలియనట్లు, జంటగా, దగ్గిరిగా, కులాసాగా పోతున్న సరోజినిని, గోపాలాన్ని చూడగానే, పెద్ద పరాభవం పొందినదానిలాగా, తలొంచుకుని చకచకా హాస్టలు వేపు వెళ్ళింది.

42 భరద్వాజకథలు

కొద్ది రోజులనుండి ఆమెముఖం కాంతివిహీనంగా ఉండటం చాలామంది విద్యార్థులకు గొప్ప ఆందోళనకారణమయింది. వాళ్ళల్లో వాళ్లు మథనపడ్డారు. చర్చలు జరిపారు. ఆఖరుకు ఒకాయన లేచి, ఒక కమిటీని ఎన్నుకోవాలనీ, ఆ కమిటీ, ఆమె విచారకారణాన్ని కనుక్కొని తెలియజేస్తుందనీ, మిగతావాళ్లు, ఆ కారణాలను నిర్మూలించి, ఆమె ముఖం యథాప్రకారం తిరిగి సంతోషంగా ఉండేట్టు చెయ్యవచ్చనీ అన్నాడు. ఎన్నికలు పెడితే పెద్ద గొడవ జరిగి, చేతులు కలిసి, కొద్ది గాయాలు తగిలేదాకా వచ్చింది. ఎవడికి వాడే, ఆ కమిటీలో మెంబర్లు కావాలని పట్టుపట్టటంవల్ల, కాసేపటికి అందరూ మెంబర్లే అయి, మామూలువాళ్లు అసలే లేకుండాపోయినారు. ఇన్ని వందలుమంది సభ్యులుగల ఆ కమిటీ యావత్తూ ఆమెదగ్గిరికి వెళ్ళటం అన్నివిధాలా ప్రమాదంగా తోచటంవల్ల, ఆ ప్రయత్నం అయిష్టంగానే విరమించుకోవాలిసొచ్చింది. ఆ కమిటీలో లెక్చరర్లు, విద్యార్థినులు, అరడజను స్టూడెంట్లు తప్ప, మిగతావాళ్ళంతా ఉన్నారు. పురుషులీవిధంగా ఆమెను గురించి విచారిస్తుంటే, స్త్రీలు సంతోషించసాగారు. ఈ అవకాశంలోనన్నా కొందరు విద్యార్థులు తమవేపు చూడకపోతారా ? చూసి... పోతారా అని ఆశించారు.

పాపం రేణుకకు కూడా అట్లాగే ఉన్నది. ఆమెకు ఇంతకాలంనుండీ ఉన్న నమ్మకం దెబ్బతిన్నది. ఒక్కసారి ఆ గోపాలం తనతో మాట్లాడితే, చూస్తే, దగ్గిరిగా పోతే చాలు. పోకపోతే తనకొచ్చిన నష్టమేమిటనే ప్రశ్నకు ఆమె సమా

ఆ క ర్ష 43



ధానం చెప్పలేదు. ఇంకో సందర్భంలో అయినట్లయితే ఆమె ఇంతగా బాధపడేది కాదేమో! ఆ సరోజిని తనకంటే, ఏ ఒక్కదాంట్లోనైనా అధికురాలై ఉన్నట్లయితే—అతను అందుకోసం, ఆ సరోజినిని "లా" చేస్తున్నాడని, తను సరిపెట్టుకోగలిగి ఉండేది. సరోజిని అన్నిటా తనకంటే తక్కువ తరగతికి చెందింది. తను తెల్లగా, ఆంగ్లోయిండియన్ కుమ్మల్లే ఉంటుంది. కళ్ళు చెవలను తాకాలని విశాలంగా ఎదిగాయి. నల్ల చిక్క గట్టి వెంట్రుకలు, పసిపిల్లల చిటికెన వ్రేళ్ళంత చిన్న పెదిమలు, అద్దంలో చూసుకొంటుంటే తనమీద తనకే గొప్ప ఆవేశం కలుగుతుంది. అద్దంలోని ప్రతిబింబాన్ని తనే ముద్దు చేసి, అదో... ఆ సరోజిని చామనచాయ, పీపుసగం జడ, పాతగుడ్డలు. తన ఖరీదు జరీచీరెలముందు, సిల్కు మెరుపుల గుడ్డలముందు దాని వాయిల్ చీరెలు, నూలు పూల చీరెలు ఏంగొప్ప? అయితే ఆమెను గోపాలం "ఇది" చేయ్యాట మేమిటి? పోనీ అతను తనతో పలకవద్దు-దానితో తను చూస్తుండగా, అంత చనువుగా ఉండకపోతే చాలుననుకుంది. ఆ సరిహద్దు కూడా వాళ్ళు దాటిపోయ్యారు. మొన్న సినిమా రెండో ఆటకు వెళ్ళింది. తనముందుగా వాళ్ళిద్దరూ, భుజాల మీద చేతులు వేసుకుని ఉన్నారు. ఆమె రక్తం చివ్వున ఎగసిపడింది. చిరుచెమటపోసింది. తల బరువుగా తిరుగుతున్నట్లయింది. ఇంక వాళ్ళిద్దరు, అట్లా భుజాలమీద చేతులు వేసుకుని ఉండటం భరించలేక, గదికి వచ్చేసింది. ఇంకోసారి, ఇంతమంది ఏమన్నా అనుకుంటారేమోనని భయంకూడా లేక, సరోజిని అతని దగ్గరనుండి ఏవో పుస్తకాలు అడిగి తీసుకుంది.

ఆ పుస్తకాల్లో ఏ ఉత్తరాలున్నయ్యో? ఎక్కడకు రమ్మని నిర్దేశించుకున్నారో? ఆ పుస్తకాలు అందుకునేప్పుడు, అడుగున వాళ్ళ వేళ్ళు కలుసుకున్నాయి. పలకరించుకున్నాయి. గోపాలం వేళ్ళు ఏమన్నాయో మరి, సరోజిని సంగ్రహంగా నవ్వి, సిగ్గుగా తల పక్కకు తిప్పుకోవటం రేణుకకు తెలీకపోలేదు. వాళ్ళిద్దరూ ఇంకా "పరిచయం దగ్గరే ఆగారని నమ్మకమేమిటి? ఆ పరిచయం, ఆవిధంగానే పెరిగి, శరీరమంతటా ప్రాకిందేమో?" అని ఆమె అనుమానం.

ఏన్నో గంటల ఆలోచనల తర్వాత ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది. సరోజిని అడ్రసు కనుక్కొని, ఆమె తండ్రికి —పోనీ బంధువులకు, "ఇట్లా, ఇట్లా" అని ఉత్తరం, పేరు లేకుండా రాస్తే? ఆమె రాసింది. 'మీపిల్ల చెడు పురుషుల స్నేహంపట్టి పాడయిపోతున్నది. కనుక గట్టిగా కోప్పడి, సరైన త్రోవలో పెట్టుకోండి" అని. కానీ పోస్టుచెయ్యే బుద్ధి పుట్టలేదు. చేసిన తరువాత కలిగే ఫలితాలను ఊహించుకుని ఈ ఉత్తరంవల్ల సరోజిని అతనితో మాట్లాడకుండా ఆమె వాళ్ళు కట్టుదిట్టం చెయ్యవచ్చు. ఇంతకాలపు అతని పరిచయాన్ని, ఆమె వదులుకోలేక, బంధువులకు ఎదురు తిరిగి, అతన్ని, తనకే శాశ్వతంగా ఉంచేసుకుంటే? లేదా వాళ్లిద్దరూ కలిసి ఎక్కడైనా వెళ్ళిపోతే?

ఈ ఊహలతో ఆమెకు చిరాకెక్కువయింది. జుట్టు పీక్కోబుద్ధి వేసింది. ఆమె తన స్థితిని గురించి ఎవరితోనూ చెప్పుకోలేదు. అయినా ఏమని చెప్పుకుంటుంది? విని నవ్వరా? ఇంతకాలం తను నిలబెట్టుకుంటున్న స్థానం వాళ్ల మనసులనుండి

పతనం చెందదా ? కోరి కోరి ఆమె దాన్ని ఎట్లా కొని తెచ్చు
కుంటుంది ? అందులో ఆమెకు నిజమయిన స్నేహితురాం
డ్రెవరూ లేరు. ప్రక్కగదుల్లో ఉన్నవాళ్ళకు ఆమంటే అసూ
యగా ఉంటుంది. ఈ సంగతి, ఏమాత్రం తను పైకి
పొక్కనా, రేపటినుండే వాళ్ళు... ఆమెతో అప్పుడప్పుడు
కొంచెం దగ్గిరగా మాట్లాడేది, ఆ హాస్టల్లోకల్లా వార్డెను.
ఆమె సాయంత్రం ఏడున్నర గంటలకు అందర్నీ గదుల్లో
చూసి పెద్దగేటుకు తాళం వేస్తుంది. ఇంక ఉదయం ఎనిమిది
గంటలకుగానీ ఆ తాళం తియ్యదు. వార్డెను, హాలు ముందు
గదిలో రాత్రి తొమ్మిదిగంటల మొదలు తెల్లారే
దాకా మేలుకునే ఉంటుంది. ఒకవేళ నిద్రపోవాలనుకున్నప్ప
టికీ, పక్కనే పనిచేస్తున్న ఆమె ప్రియుడు, ఒక్కక్షణమూ
ఆమెను నిద్రపోనివ్వడు. అతను ప్రతిరోజూ రాత్రిపూట ఇనప
ముళ్ళతీగెలు తప్పించుకుని వచ్చి ఆమెకు "బోధ" చేస్తుం
టాడు. పైకి ఆ వార్డెనూ అతనూ, అనటం, "ఆధ్యాత్మికం"
అని. కానీ ప్రతి ఉదయమూ ఆమెముఖం చూసినవా
ళ్ళెవరూ, ఆ మాటను నమ్మటానికి సాహసించరు. అయినా
అప్పుడప్పుడు "అన్నయ్య"లూ, "బాబాయి"లూ రాత్రిళ్లు
ఆ హాస్టల్లోకి, వార్డెన్ దయవల్ల రావటం కద్దు. రాత్రి
మూడుజాములదాకా, "చెల్లెళ్ళను" "అన్నకూతుళ్లను"
ఆ వచ్చినవాళ్ళు "పరామర్శించటం" కూడా కద్దు. పాపం!
వాళ్ళు మాత్రం ఏం చేయగలుగుతారు ? ఎంత అణచినా
అణగని యవ్వనోద్రేకం, వాంఛ, ఆవేశం వాళ్ళనా అబద్ధా
ల్లోకి, ఆత్మవంచనలోకి చీకటిబతుకుల్లోకి, లాక్కుపోతుంది.

ఆ పదాలవెనక, ఎటువంటి నీచపుపనులు జరుగుతున్నాయో ఆలోచించరు. ఆ ఆకర్షణ, నీచమూ, పాపమూ, ఘోరమూ, అనుకోక, అది అతిసహజమూ, ఆరోగ్యమూ, ఉన్నతమూ అని గుర్తించితే ఇప్పుడు జరుగుతున్నవనుకుంటున్న అత్యాచారాలు చాలా తగ్గిపోగలవు. లోకమూ బాగుపడుతుంది.

మరుసటిరోజు ఆమె అతిప్రయత్నంమీద, గోపాలం అడ్రసు కనుక్కుంది. ఇక వేరే ఆలోచనలు అనవసరం. తనే స్వయంగా అతని గదికెళ్ళి తను అతన్ని ఎందుకు ఆకర్షించలేక పోయిందో, తనకంటే ఆ సరోజిని అతన్ని అంతగా ఆకర్షించటానికి గల కారణాలేమిటో తెలుసుకుని, తనుగూడా, ఆ కారణాలను తనలోకి తీసుకుని, తనకు మిగిలివున్న ఈ ఒక్క శత్రువునుగూడా పరాభూతంచెయ్యాలి. ఈ ఉద్దేశ్యంతోనే ఆమె ఆనాడు, చాలా జాగ్రత్తగా అలంకరించుకుంది. అసలే ఆమె తెలుపులో కొంచెం పసుపు కలిపినట్లుగా ఉంటుంది. దానిమీద రోజారంగు సిల్కుచీరె, నలుపు ముఖమల్ జాకెట్టు, రకరకాల రాళ్ళుతాపిన నెక్లెసు తళతళ మెరుస్తో, ఖరీదైన సువాసన నూని చేతిలో డబ్బా. క్రింద వార్డెను చేతిలో ఓ కాగితం పెట్టి, గేటు తీయించింది. ఆ నోటు ఎంతదో గూడా ఆ వార్డెను చూసుకోలేదు. అవతల ఆమె ప్రియుడు అప్పటికే వచ్చాడు గదిలోకి తీగలుదూకి.

సులభంగానే రేణుక అతని గదిని చేరగలిగింది. ఒక్కసారి అటూ ఇటూ చూచి, తలుపు కొట్టింది. లోపల ఎవరన్నా చూస్తారేమో, తను యిట్లా రావటంచూచి ఏమనుకుంటారోనని భయపడుతూనే ఉంది.

ఎవరోనని గోపాలం కొన్ని క్షణాలు ఆగిచూసి తలుపు తీశాడు. రేణుక చప్పున లోపలికి వచ్చి, తలుపుకు గడియ బెట్టింది. అతను ఏ క్షణంలోనూ రేణుక తన గదికి వస్తుందని భావించలేదు. క్షణకాలం నిశ్చేష్టుడయినాడు. మాట్లాడాలని ప్రయత్నం. కానీ మాటరాదు. ఏం చెయ్యాలో తెలీదు. పసిపిల్లవాడు కొత్తగా సినిమాను చూస్తున్నట్లు వుంది అతనికి. ఇంతసేపూ ఆమె ఏ ఏ విధంగా ఊహించుకుంటూ వచ్చిందో అవన్నీ ఫలించలేదు. తను యింతవరకూ అతనితో మాట్లాడలేదు, ఎప్పుడూ, ఎక్కడాగూడా. చివరికి గోపాలమే, అతిప్రయత్నంమీద గొంతు పెకలించి, "కూచోండి" అన్నాడు.

ఆమె కూచోలేదు. అనవసరంగా గది నాలుగు మూలలూ చూసింది. గోడలకు సినిమా తారల ఫోటోలు, గుడ్డలులేని అమెరికన్ పఠాలు, పక్కగా మంచం,దానిమీద తెల్లబూరుగుపరుపు. చిందరవందరగా పుస్తకాలు. పైన పెద్ద కాంతివచ్చే ఎలెక్ట్రిక్ దీపం, రెండు కుర్చీలు పాతవి, కాలు విరిగిన డ్రాయరు.

"కూచోండి" అన్నాడు గోపాలం కాస్త స్థిమితపడి.

"ఆఁ...! అవును."

ఆ గదినంతా కాంతులతో నింపుతూ వెళ్లి కుర్చీలో కూచుంది. అతని చూపులు ఆమె వీపు కదిలికమీద నిలిచాయి, దృఢంగా. ఆమె గంధర్వాంగనవలె, సౌందర్య శాణాచివలె, ఆ కుర్చీలో కూచుని అతనివేపు చూస్తోంది. గోపాలంగూడా ఆమెను చూడకుండా ఉండలేకపోయాడు.

ఎంత కాలం గడిచిందో వాళ్లిద్దరకూ తెలీదు. చివరకు గోపాలమే పలకరించాడు ముందు.

"ఇట్లా వచ్చారు ?"

"ఆఁ" అన్నది రేణుక దగ్గుత్తిక సరిచేసుకుని. "వచ్చాను...వచ్చాను ... మధ్యాహ్నం నువ్వు రాలేదు కాలేజీకి."

"రాలేదు."

"ఏం ?"

ఎందుకో ఆమెకు ? అతను మాత్రం పలకలేదు.

"ఎందుకని ?"

"ఊరికేనే !"

అని అన్నాడుగానీ, ఏదో దాస్తున్నాడని అతని కంఠం చెబుతూనే ఉంది.

"సందేహం"

ఆగి అతని వేపు చూసింది రేణుక.

"ఎందుకు సందేహం ?"

"చెప్పటానికి" అన్నది.

ఇంక సంభాషణ జోరుగా సాగిపోతూంది. ఆమెగూడా కొద్దికొద్దిగా ఆ గది వాతావరణానికి ఎడ్జస్టు అవుతోంది.

"జ్వరం ?" అన్నది రేణుక.

"కాదు."

"తలనొప్పి ?"

"అబ్బే !"

నవ్వాడు గోపాలం.

"మరి..."

అని అడిగింది రేణుక. మిగతాది అతను పూర్తిచేస్తాడని కానీ...

"పోనీండి."

అన్నాడు అతను, ఆ విషయం చెప్పటం ఇష్టం లేనట్టుగా. ఆమె ముఖం చెప్పింది నొచ్చుకున్నట్లుగా.

"ఆఁ...మరేం లేదు..."

"ఊఁ"

పలచగా, ఆమె చిన్న పెదిమలు నవ్వాయి. అది చూసి ఉత్సాహంతో...

"సరోజిని రాదు కాలేజీకి. అందుకని..."

"మీరూ మానారు. అవునా?"

ఆమె కంఠంలో దాచినా, దాగని కఠినత. ఎవరి మీదనో అసూయ...అట్లా సంభాషణ పెరిగింది. కాస్సేపటికి వాళ్ళు చిరకాల స్నేహితులుగా మాట్లాడుకోసాగారు. "ఏం బావుంటుంది?" అన్నది రేణుక.

"ఎవరు?"

"సరోజిని"

అతను కాసేపు తలొంచుకుని, మెల్లిగా ఆమె వేపు చూస్తో—

"ఎవరికంటే?" అన్నాడు.

ఆమె గట్టి చిక్కులో పడ్డది. నిజం. ఎవరికంటే సరోజిని అందంగా ఉండదు? తనకంటే! మిగతావాళ్ళకంటే

బావుండకపోవచ్చు. కానీ తక్కువగా ఉండదు మరి. ఆమె నవ్వింది.

"మీరు ఆమెను..." నసిగింది.

"ఆమెను ?" గట్టిగా అడిగాడు.

"ఏం లేదు"

"కాదు. ఆమెను—?" అన్నాడు మళ్ళీ.

"ఆమె బావుందా ?"

"ఎవరికి ? నాకా ? నా కేనా ?" నవ్వాడు.

ఆమె సిగ్గుపడింది.

"కాదు" అన్నాడు గోపాలం.

ఆమె తలెత్తి అతని వేపు చూసింది విజయసూచకంగా.

"కాదు...అయినా ఆమె మీకు బావుండలేదు. అటు వంటప్పుడు దానితో మీరు అంత చనువుగా ఉంటా రేం? ఒకటి రెండుసార్లు సినిమాలో చూశాను మీ ఇద్దర్నీ?" అన్నది.

"అప్పుడప్పుడు సరోజిని నా గదికూడా వస్తుం టుంది."

ఆ మాటలతో రేణుక ఉలిక్కిపడ్డది. తన సొత్తేదో అపహరింపబడినట్లుగా "ఛీ"లయింది.

"ఒంటరిగానా ?"

"ఇంకోరున్నప్పుడు ఆమె యిక్కడిదాకా అసలు రాదు."

"వాళ్ళ అమ్మా నాన్నా..."

"తెలుసు. పోనీ తెలీదేమో! కొద్దిరోజుల్లో తెలియ చెయ్యబోతున్నది"

"ఏమని ?"

గోపాలం నవ్వాడు.

ఆమెకు ఆ నవ్వు కంపరమెత్తించింది.

"పెళ్ళి ! !"

ఆమె ప్రశ్నకు గోపాలం జవాబివ్వలేదు. ఆమె ప్రయత్నం నెరవేరింది. గోపాలంతో మాట్లాడాలనుకుంది. మాట్లాడింది. అతనికి చాలా దగ్గరగా ఉంది ఆమె. మరి పోదేం ? ఆ ప్రశ్న ఆమెకు స్ఫురించటల్లేదు.

"నేనంటే" తలొంచుకుని అన్నది బరువుగా.

"ఏమిటి ?"

"మీకు అసహ్యం కాదుగదా ?"

మెల్లిగా తలొంచుకునే, కంటి కొసలనుంచి అతన్ని చూస్తూ అన్నది.

"ఎవరన్నారు ?" అన్నాడు గోపాలం. "నా ప్రవర్తనలో మీ కిట్లాంటి అవకాశాలు కనిపించాయా ?"

ఆమె చప్పున తలెత్తింది. మెడలోని నెక్‌లెస్ లైటు కాంతికి రంగు రంగులుగా నవ్వింది మెరుపులతో.

"మరి ఎప్పుడూ నా వేపు చూడరు. దానినిబట్టి... అనుకున్నాను."

"ఎప్పుడూ నిన్ను చూస్తేనే నువ్వు గావున్నట్లా ? లేకపోతే కాదని ఎవరన్నారు ?"

"నేను కనిపెడుతున్నాను. మీరు కొప్ప మిగతా చాలామంది, నా వేపు అసక్తిగా చూస్తున్నారు."

"నిజం" అన్నాడు గోపాలం. "ఎందుకు చూడటం? ఏం వస్తుంది?"

"మరి వాళ్ళంతానో?"

"వాళ్ళయిష్టం అది. నాకు కాదు."

"ఎందుకని?"

అన్నది. అని సిగ్గుపడ్డది ఆ ప్రశ్నకు.

"చూశారు. చాలాకాలంనుంచి చూస్తున్నారు. ఏం ఒరిగింది వాళ్ళకు? నేనూ ఒకటి రెండుసార్లు చూశాను నిన్న..."

"మరి..."

"అనవసరం. చూస్తాననుకో! ఏం లాభం? నువ్వు దొరకవు. నాకు అందనిదానివి. నిన్నే చూస్తూ కలలు కనే కంటే, చిన్న శ్రమతో లభ్యమయ్యే యింకో ప్రయత్నం చేసుకోవటం మంచిది కాదా?"

రేణుకముఖం జేవురించింది. అతను చెప్పుకుపోతు న్నాడు యిది గమనించి కూడా.

"కలలు. ఒట్టి కలలు; గొప్పవే కావచ్చు—కానీ నిరర్థకం. ఒక అమూల్యమయిన స్వప్నంకంటే, మామూలు అనుభవం చాలాగొప్పది. చాలామంది నీ రూపానికి భ్రమించి. పిచ్చివాళ్ళవుతున్నారు. అంతే వాళ్ళగతి. ఎప్పుడూ ఆ గిరిదాటి రాలేరు. నువ్వు ఆజ్ఞాపిస్తే వాళ్ళు, రక్తంతో నీ పాదాలు కడుగుతారు..."

ఆమె కళ్లు గర్వంతో మెరిశాయి. తృప్తిగా ఒక్క నిట్టూర్పు విడిచింది.

"వాళ్ళకు నువ్వేం లభించావు? నాకయినా అంతే! అందుకని నిన్ను తప్పుకోవటానికి వీలయినంతవరకూ ప్రయత్నిస్తాను. నీ మీద వాత్సల్యంలో నూరోవంతు—చాలు—చూపెడితే, ఇతరులు అందుతారు. నువ్వు దొరకవు. అందని దానికోసం పరుగులెత్తి, ఉన్నదాన్ని జారవిడుచుకోవటం నా మతం కాదు..."

"మరి లోకంలో, ప్రేమ, ఆకర్షణ..."

"ఏం ప్రేమ?"

"అందరూ అనేదీ, పుస్తకాల్లో ఉన్నదీ—ఎంతో మంది ఆ "ప్రేమ" కోసమని ఎన్నో బాధలుపడి, త్యాగాలు చేసి, ప్రాణాలు కూడా పోగొట్టుకుని...అదంతానో?"

"అది మనిషినిబట్టి ఉంటుంది. ఒకొక్కడు ప్రేమ కోసమని, జీవితాన్ని ధ్వంసంచేసుకుంటాడు. ఇంకొకడు ప్రేమను "గవ్వ" లాగా చూస్తాడు."

"నిర్మలమైన ప్రేమ శాశ్వత మంటారు. దానికి చావు, బ్రతుకూ ఉండక అనంతమని...అట్లా క్షణం మెరిసి పొయ్యేది కామమనీ..."

"భార్యాభర్తలు మొదట పరాయివాళ్ళే! మొదటి రాత్రితో వాళ్ళకు ప్రేమ పుట్టుకొస్తుంది. అట్లా జీవితాంతం వరకూ ఒకరికొకరుగా ఎక్కడో, అరుదుగానైనా ఉంటారు. ఉండకపోరు మరి..."

అట్లా సాగిపోతున్నది. అతని మాటలు వింటుంటే, తను జీవితానికి చాలా కొత్తసభ్యురాలని తెలుస్తోంది. అతను ఎంతో అనుభవజ్ఞుడులాగు, తత్త్వవేత్తలాగు మాట్లాడుతున్నాడు. తనను చూసి, ఈలలు వేసి, చప్పట్లు కొట్టే, ఆ గుంపుకంటే, గంభీరంగా చరించే ఇతనెంత గొప్ప! గోపాలం ఏదో చెప్పుకుపోతున్నాడు ఆమె వింటున్నదని. ఆమె మళ్ళీ తన ఆలోచనలోకి...ఇతన్ని, ఇంతటి ధీరుడ్ని, సరోజిని, సులభంగా తన వలలోకి తీసుకుంది. ఆమెకు దక్కకుండా గోపాలాన్ని, తనకుగా...జెలసీ. సరోజినిమీాది జెలసీ తనను, ఏ స్థితికి తీసుకెడుతున్నదో ఆమె ఆలోచించ లేదు!

...చాలా పొద్దుపోయింది. ఆ సంగతి రేణుకకు తెలుసు. కానీ లేవలేదు. పోబుద్ధిగాదు. ఏవో శక్తులు ఆమెను బంధించి కదలనివ్వటంలేదు. ఇంతవరకూ ఆమె ఒంటరిగా, ఏ పురుషుని గదిలోనూ ఉండలేదు. ఇంకా పురుషానుభవం తెలీదు. అవ్యక్తావస్థ—ఏం చెయ్యాలో ఎట్లా చెయ్యాలో, అసలు చేయగూడదో తెలీని అయోమయం! కానీ ఎంత మధురమయిన అవస్థ. జగత్తులో ఏ కార్యమూ యివ్వలేని మహోత్కృష్ట తన్మయావస్థ. ఆమెలో కొద్దికొద్దిగా మార్పు అతను గమనిస్తూనే ఉన్నాడు. అది...వస్తుతః రేణుకకు పురుషులంటే అసహ్యం—స్త్రీలను బానిసలుగా, జంతువులుగా, యంత్రాలుగా ట్రీట్ చేస్తారని. అందుకే ఆమె, ఏ పురుషులకూ చిక్కక, ఆవిధంగా పురుషలోకాన్ని, బాధి

స్తోంది. కానీ, తను ఓడిపోయిందా? ఓడిపోతున్నదా? తనిట్లా అయిపోతున్న దేం? తన ప్రతిజ్ఞలన్నీ ఏమైనాయి?

"చాలా పొద్దుపోయింది."

అన్నాడు గోపాలం. ఆమె పలకలేదు.

"హాస్టల్ దూరం . . ."

ఆమె అతనివేపు అయోమయంగా చూసింది.

"పోనీ..." అంటున్నాడు.

రేణుక చప్పున లేచి నిలుచుంది. లైటు వెలుతురు ఆమె ఒంటిమీదపడి చిందుతోంది. తనలో అలజడి కలిగించే కొత్తదనమేదో, బైటికి రాలేక, లోపల ఇమడలేక, ఇబ్బంది పడుతోంది.

గోపాలం చూచాడు ఆమె స్థితిని. మెల్లిగా దగ్గరగా వచ్చి, స్వతంత్రంగా ఆమె భుజంమీద చెయ్యివేశాడు. ఎవరో ఆమె హృదయంలో "జాగ్రత్త! జారిపోతున్నావు నువ్వు—అసహ్యించుకునే నీచస్థితిలోకి" అని కఠోరంగా ఘోషించారు. అతని చేతిని విదిలించుదామనుకుని... లేదు. ఆ శక్తిలేదు. ఏదో గొప్ప అవస్థలోకి తను వెళ్ళుతున్నట్లు తోచింది ఆమెకు. అతని వేళ్ల చివర్లనుండి, ఆమెలోకి విద్యుత్కణాలు. ఏ గొప్ప విశ్వానందమో ఘనీభవించి, ఆ నిమిషాన ఆమెలో ప్రతిఫలించినట్లయింది. పురుషస్పర్శ నెరుగక, నిద్రించే ఆమె యవ్వనం, ఒక్కసారి మేల్కొని, అనివార్యంగా విస్తరిల్లింది.

...కళ్లు తెరచింది. ఎంతసేపు తనా సుందరస్వప్నంలో ఉందో తెలీదు. పక్కనే గోపాలం ఉన్నాడు. ఇంతకాలమూ,

తను ఊహించని మాధుర్యానుభవాన్ని, తనకు ప్రసాదించింది ఇతనేనని ఆమెకు స్ఫురించేటప్పటికి, అతనిమీద అనంతమైన గౌరవం కలిగింది. సర్వజీవనాన్నీ కరిగించి, అతని పాదాల ముందు అర్పితంచెయ్యాలనిపించింది. ఎందుకో అతని ముఖం చూడటానికి ఆమె సిగ్గుపడ్డది. రెండుచేతులతోనూ ముఖాన్ని కప్పుకున్నది.

"ఛీ దొంగా! చేతులు కప్పకు"

అన్నాడు గోపాలం ఆమె చేతుల్ని విడదీస్తో. ఆమె ఆశ్చర్యపోయింది, అతను తనమీద తీసుకుంటున్న ఆ చనువుకు.

"వద్దు, కప్పకు. నీ ముఖం ఎప్పుడూ నాకు కనిపిస్తూ ఉండాలి . . ."

* * * *

సుకుమారమైన పచ్చని ఎండజల్లు ఆమెను తాకి దొర్లిపోయింది. మెల్లగా సుఖస్వప్నాంతంనుండి ఆమె కళ్ళు తెరిచింది. ఆమె తన్ని పరుపునుండి, తెల్లటి ఒళ్ళును కదిలిస్తూ నూతనత్వం తనకు తనే! తను తను కాదో? తనలోకి ఏ కిన్నరులో, తమ సర్వశక్తులనూ అర్పించారేమో? రాత్రి జరిగింది కలో? నిజమో? ఆ స్మృతి రావటంతో ఆమె మళ్ళీ కళ్ళు మూసుకుని, ఆ ఆనందాన్ని అనుభవంలోకి తెచ్చుకొంటోంది.

"ఇంకా నిద్రేనా?"

అన్నాడు గోపాలం వచ్చి, ఆమె పక్కనే కూచుని రెండు చేతులనూ ఆమె జుట్టులో కలిపి.

బరువుగా కళ్లు తెరిచింది. గోపాలం! తనలోకి స్వర్గ ద్వారాలు తెరిచిన యోధుడు.

"పొద్దెక్కింది..."

ఆమె లేచి చప్పున ముఖం అతనిగుండెల్లో దాచుకుంది. ఎప్పుడో చిక్కుపడిన ఆమె నలుపు జుట్టు, భుజాలను పలచగా కప్పి, అతని మీదకు జారింది.

స్నానం, కాఫీ, మధ్యాహ్నం భోజనం గదిలోకే తెచ్చాడు గోపాలం. ఆ రోజు ఎవ్వరూ కాలేజీకి వెళ్ళలేదు తను రోజూ చూసేదయినప్పటికీ, ఆనాటి ఎండ ఆమెకు అద్భుత వరంలాగు తోచింది. నీలం ఆకాశం, నీటిమబ్బులు, చెట్ల పసరుదనం, పిట్టల అరుపులూ, అన్నీ నూతనజీవంతో, శక్తితో ప్రకాశిస్తున్నట్లు తోచింది రేణుకకు. తనలో ఇంత శృంగారతృష్ణ ఉన్నదని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. ఈ విశాల విశ్వసౌందర్యంలోకి, తన ఆత్మను తెరిచింది గోపాలం! లేకపోతే, తను ఎంతకాలం అట్లా, మత్తుగా ఇదే ప్రపంచమని, గుడ్డిగా నమ్ముతూ పడివుండవలసివొచ్చేదో! తను ఏనాడూ వూహించజాలని యీ లావణ్యావరాలను తనకు ప్రసాదించిన ఆ గోపాలానికి, తను ఏమిచ్చి ఆ ఋణం తీర్చుకో గలుగుతుంది? అంతేగాని, తను అనుభవించే ఈ మాధుర్య స్వప్నాలన్నీ, లావణ్యాలన్నీ, తనవల్ల అతనికీ లభించాయన్న ఆలోచనే రేణుకకు రాలేదు...

కాలేజీకి ఆమె రాకపోవటంవల్ల, విద్యార్థిప్రపంచంలో కలవరం బయలుదేరింది. ఇండియామీదకు అమెరికా దాడి చేస్తుందన్నా, అంత సెన్సేషన్ వాళ్ళలో కలిగివుండదు

కొంతమంది, కొద్దిరోజుల్లో ఆమె కనిపించకపోతే, చదువులు మానుకోవటానికి మనస్ఫూర్తిగా నిర్ణయించుకొన్నారు. ఇంకొందరు అతిధైర్యంగా లెక్చరర్లకు, ప్రిన్సిపాలుకు రిపోర్టు చేశారు. హాస్టలు వార్డెన్ను గట్టిగా అడిగారు. ఆమె ఒక రోజు ఉదయం కాలేజీకి వెళ్ళటం తప్ప తరువాత తనకు కనిపించనేలేదని ప్రమాణం చేసి చెప్పింది. ఈ వార్తలు విన్న తరువాత విద్యార్థినులకు గొప్ప సంతోషమొచ్చింది, తమ ప్రత్యర్థి అంతర్థానానికి!

ఎవరికీ గోపాలంమీద అనుమానం కలగలేదు. రేణుక ఏ పరిస్థితులలోనూ అటువంటి వాడిని దగ్గిరికికూడా జేరనివ్వదని వాళ్ళ అంధవిశ్వాసం. ఎక్కువమంది ఆమెను వెతికే కార్యంలో నిమగ్నులవటంచేత, బహుకొద్దిమంది విద్యార్థులే, కాలేజీకి హాజరయినారు — లెక్చరర్లకు గూడా బొత్తిగా ఉత్సాహంలేదు—వాళ్లకు ఇన్‌స్పిరేషను ఇచ్చే వ్యక్తి ప్రస్తుతం లేదుగనుక.

ఈ నాలుగు రోజులూ రేణుక అతనిగదిలోనే ఉంది. బయట ఏం జరుగుతున్నదో, హిమాలయాలు భూమిలోకి దించుకుపోయినాయో, సర్వప్రపంచమూ మాయమయి, ఒక్క ఆ గది మాత్రమే, ఆ ఆకాశంమధ్య ఊగుతోందో గూడా తెలీదు. తప్పనిసరి గనుక, అన్నం తినటమైనా. అతన్ని చూస్తూ మాయమవుతాడేమోనని, అప్పుడప్పుడు మెల్లగా తాకుతూ, యిది స్వప్నమేమోనని భ్రమించి, చిదికిపోతుందని దిగులుపడి, చప్పున అతన్ని బిగ్గరగా తన వేపు తీసుకుంది...ఒకరోజు గోపాలం, ఆమె చెవిలో,

"ఈ సుఖం ఎంతకాలం?" అన్నాడు.

అతని అనుమానానికి రేణుక కళ్ళు భయంతో మెరిశాయి. చిన్న, ఎర్రపెదిమలు దిగులుగా కదిలాయి.

"ఏమిటి నువ్వంటున్నది?"

"ఎంతకాలం...?"

"ఎందుకు నీ కా అనుమానం?" అన్నది బాధగా. ఇదంతా కొద్దికాలంలో తనకు దూరమయిపోతుందని ఆమె ఖిన్నురాలయింది.

"చాలాకాలం, ఎల్లకాలం. ఇంక ఎప్పుడూ ఎడబాటే" ఉండదు...అన్నది దృఢంగా, అతని గుండెలమీద ముఖం ఆన్చి.

"ఎట్లా సాధ్యం?" అన్నాడు నవ్వి.

"ఏం? నేను...నేనుగదా...!"

"సరే! మరి లోకులు...పోనీ...మీవాళ్ళు. బంధువులు, తల్లిదండ్రులు, వీళ్లు ఒప్పుకుంటారా దీనికి?"

"ఏం నష్టం వాళ్లకు మనమిట్లా ఉన్నందువల్ల?"

ఎంత అమాయకత్వం! లోకానికి ఎంత నూతనురాలు!

"చాలావుంది. వాళ్ళు ఏనాడూ అనుకోనిది, వాళ్ళ ఆలోచనలోకే రానిది, మనం ప్రత్యక్షంగా, సులభంగా, ఆరోగ్యంగా అనుభవిస్తున్నామనే జెలసీ భూతం వాళ్ల హృదయాలను తన్ని, పురికొల్పుతుంది. మనముందు తమ క్షుద్రత్వాన్ని, అల్పత్వాన్ని భరించలేక ధ్వంసంచేస్తారు."

"మనం ఒప్పుకోకపోతే? లొంగకపోతే?"

"లొంగేట్టు అన్ని ప్రయత్నాలు..."

"గట్టిగా ఎదురుతిరిగితేనో ?"

అన్నది ఆఖరి మాటగా. ఆ వొచ్చే జవాబు గూడా నిరాశనే కలిగిస్తే. ఆమె ఇక ఆ స్థితిలో ఉండ లేదనిపిస్తుంది వాలకం.

"మానుకుంటారు."

ఆమెలోకి సంతృప్తి వచ్చింది.

"నేను నిలబడతాను" అన్నది.

"కానీ...అపవాదులు..."

అని గొణుగుతున్నాడు గోపాలం.

"యెందుకు? యిక్కణ్ణుంచీ మనం భార్యాభర్తలం. పెళ్ళి చేసుకుందాం. యెవరేమనగలరు మనల్ని ?"

"మీవాళ్లు ఒప్పుకుంటారా ?"

"యెవరూ లేరు నువ్వుతప్ప !"

"మీ నాన్న, అమ్మ..."

"నాన్న లేడు, నా చిన్నతనంలోనే చచ్చిపొయ్యాడు. అమ్మ వొక్కతే నాకు. ఆమె కాదనదు."

ఒకరోజు రాత్రి ఇద్దరూ కలిసి, హాస్టల్ కొచ్చారు. హఠాత్తుగా రేణుకరాకను చూచి, తోటి విద్యార్థినులు ఆమెచుట్టూ మూగారు. ఏమిటేమిటో అడుగుతున్నారు. ఎవ్వరితోను సరిగ్గా మాట్లాడక, తన సామాను సర్దుకుని, గోపాలంతో సహా బయలుదేరింది.

"ఇంక కనపడను మీకు. కాలేజీకి రాను. మా ఊరు వెళ్లిపోతున్నాను" అన్నది వార్డెనుతో. గోపాలం గూడా తన సామానంతా సర్దుకున్నాడు.

కథా నిలయం
1318

ఈ సంగతి తెలిసి అందరూ ఆశ్చర్యపోయినారు. కొందరు అమితంగా బాధపడ్డారు. అందరిలోకీ గాఢంగా విచారించింది సరోజిని. ఆమెకు గోపాలంమీద ప్రేమ. ఇక ముందు వాళ్ళు పెళ్ళిచేసుకోవాలని గూడా అనుకున్నారు. అది ఇట్లా విచ్ఛిన్నమయింది.

ఎడ్లబండి పెద్ద పెంకుటింటిముందు ఆగింది. రేణుక, గోపాలం దిగారు. జీతగాళ్ళు సామాను యింట్లోకి దించారు. చంద్రమ్మ కూతురువెంటనున్న గోపాలాన్నిచూసి ఆగింది, నీళ్ళ వ్యాటానికి ముందుకు వచ్చిందల్లా.

"వీరు గోపాలం...గోపాలంగారు. మా కాలేజీలోనే చదువుతున్నారు. చాలా మంచివారు" అని తల్లికి అతన్ని పరిచయంచేసింది రేణుక. ఆమె గోపాలాన్ని ఒక గదిలోకి తీసుకెళ్ళి, పూజలు చెక్కిన కుర్చీలో కూచోబెట్టి తను లోపలి కెళ్ళింది.

ఆ పూట వాళ్ళిద్దరూ కలిసే భోజనం చేశారు. చంద్రిమ్మ స్వయంగా వొడ్డించింది, వీలయినప్పుడల్లా అతన్ని జాగ్రత్తగా చూస్తూ. ఆమెకు కూతురు చేస్తున్నపని అంత ఉత్సాహంగా లేదు. మధ్యాహ్నం అతను గదిలోనిద పోతున్నప్పుడు, చంద్రమ్మ కూతుర్ని పిలిచి విశదంగా అడిగింది.

"నిజమే! అబద్ధంగాదు" అన్నది రేణుక.

"నలుగురూ ఏమంటారు?"

"ఏమంటారేం?"

"నవ్వరూ?"

"ఎందుకు? ఏం ఉంది ఇందులో నవ్వటానికి! ఏం తప్పని నవ్వటం?"

"మనం గౌరవంగా బ్రతికాం. ఏ గొప్ప హోదా గలవాణ్నో, డబ్బుగలవాణ్నో గాక..."

"చేసుకోదలచింది నేను, నువ్వో వీళ్ళందరూ గాదు. నా కిష్టమయినప్పుడు మరి మధ్యలో వీళ్ళ జోక్యమేమిటి?"

"మరి పెద్దలు, కట్టుబాట్లు" అంటున్నది చంద్రమ్మ.

"వాళ్ళ పెద్దరికం అంగీకరిస్తేనే పెద్దలు. నా సుఖమేదో నిర్ణయించుకోవలసింది నేనుగాని వాళ్లు కాదు. ఒకళ్లకోసమని, ఎంతకాలం జీవిస్తాం చెప్పు?"

చంద్రమ్మ మాట్లాడలేకపోయింది. తను గట్టిగా పూనుకుంటే, గోపాలం వెడతాడు కానీ, కూతురు విచారిస్తుంది. ఒక్క కూతురు. ఆమెను కాదని ఇంక తనకు మిగిలేదేమిటి? అయినా కాదనలేదు. నలుగురూ నవ్వవొచ్చు. అందుకని—నవ్వుతారని, కూతురు ప్రేమను ఎట్లా తెంచుకోమంటుంది? తను తెంచుకున్నదా ఆ విశ్వనాథంతో సంబంధం?

రెండు రోజుల్లోనే అతను ఆ ఇంటి పనివాళ్ళందరికీ పరిచయమైనాడు. తమకు కాబోయ్యే యజమాని అతనేనని వాళ్లు తెలుసుకున్న తరువాత, చుట్టుపక్కల కొంతమంది వచ్చి, అతన్ని చూసిపొయ్యారు. ఈ హడావిడివల్ల విశ్వనాథం రాత్రులు చంద్రమ్మ దగ్గరకు రావటానికి వీల్లేకుండా ఉన్నది.

చాలాప్రొద్దుపోయి,గోపాలం లేచాడు.వరండా అంతా చీకటిగా ఉంది, దీపం ఆరిపోయింది గావును గాలికి. ఆ వేళ

రేణుక రాదు, తల నొప్పిగా ఉందట, అందుకని వేరే ఇంకో చోట పడుకుంటానని చెప్పింది ఇందాక. ఆ సంగతి అతను మరచిపోలేదు, కానీ, ఆ రాత్రి రేణుక అతనికి అవసరం. ఎంతో ప్రయత్నం చేశాడు. ఆమెను ఈ రాత్రి తాకగూడదని వొట్లు వేసుకున్నాడు. కానీ అసంభవ మయిపోయింది. ఆ గది మధ్యాహ్నం తను చూశాడు. కుడిచేతివేపుగా, అలమరకు కాస్త దూరంలో ఉంది. మెల్లగా లేచి, జాగ్రత్తగా వొస్తున్నాడు...కాళ్ళకు ఏదో ... ఏమిటి? జాగ్రత్తగా చూశాడు. మంచం; ఎవరో పండుకుని. ఎవరు? గాలి కోసమని రేణుక యిక్కడ వేసుకున్నదా? నిశ్శబ్దంగా మంచం ప్రక్కనే కూచున్నాడు. తల, పొడుగు వెంట్రుకలు. తను కుడిచేతివేపుగానే వచ్చాడు. అతనికి నిశ్చయమయింది, ఆ వ్యక్తి రేణుకేనని.

“ఎవరు? విశ్వం! ఎట్లా వొచ్చావు ఇంత రాత్రి, పిల్లను తప్పుకుని?” అని మెల్లిగా తన చెవిలో అంటూ చేతుల్తో అతన్ని దగ్గిరికి తీసుకున్నది.

గోపాలం నిర్జీవుడయినాడు. మెదడు మొద్దుబారిపోయింది. కళ్ల ముందు పెద్ద మెరుపు మెరిసి, చీకట్లు చాచుకున్నట్లయింది.

“పలకవేం? ఎట్లా? ఎట్లా వొచ్చావు విశ్వం?”

ఆ చీకట్లో...ఏదో ఆమె చేతులు జంకుతున్నాయి. వాటికి విశ్వం శరీరం, చాలా కాలంనుండీ తెలుసు. ఈ కొత్త శరీరం...ఎవరు? ఎవరు?

చివ్వున ఆమె అతన్ని విదిలించింది. కాని వొదలడు.

"ఎవరు ?"

"నేను..."

ఆమె తెలుసుకుంది అతన్ని, అతనూ గ్రహించాడు. ఏ శక్తులు వాళ్లను నిర్దేశించాయో ? ఏ ఘోరశాప ఫలితమో, వాళ్లు విడబడలేకపోవటం ?

రెండు మూడు రోజులు గడిచాయి. ఈ రోజుల్లో గోపాలం రాత్రులు రేణుకకు కనిపించలేదు—ఒకరోజు ఉదయమే, పనివాళ్లు గజబిజిగా తిరుగుతున్నారు ఇల్లంతా... గోపాలం కనిపించలేదు. చంద్రమ్మా కనిపించలేదు. ఇనప పెట్టెలో పదిహేనువేల రూపాయలుగూడా కనిపించలేదు.

---